క్లుప్తంగా

రక్తదానం



రక్తదాన కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

కడప కోటిరెడ్డి సర్కిల్ / వైవీయూ : కడప నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. జేబీవీఎస్ ది ప్రిజర్వర్ సేవాసమితి, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థినులు రక్తదానం చేశారు. అనంతరం రక్తదానం చేసిన విద్యార్థులకు కరస్పాండెంట్ బి. రామకృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ డా. కె. సూర్యనారాయణరెడ్డి, రిమ్స్ వైద్యులు డా. రాజేంద్రప్రసాద్, డా. వినీత చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ సుబ్బనరసయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు

కడప కార్పొరేషన్ : పునీత లూర్దు మాత తిరుణాళ్ల సందర్భంగా శనివారం మరియాపురంలో కమిటీ సభ్యులు ఎం. జయమ్మ, జె. రమేష్ కుమార్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మరియాపురం చర్చి ఫాదర్ బిరుసు రాజా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇందులో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. మరో ఐదుగురికి కన్సోలేషన్ ప్రైజెస్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకుడు ప్రదీప్, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ఐఆర్‌ను ప్రకటించాలి

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు 35 శాతం ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని ఎస్టిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు డిమాండ్ చేశారు. శనివారం కడపలోని ఎస్టిఎఫ్ కడప జిల్లా కార్యాలయంలో జరిగిన జిల్లా ముఖ్య కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డీఎస్సీ నోటిఫికేషన్‌లో అప్రెంటిస్ విధానాన్ని తిరిగి ప్రభుత్వం ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుపాకుల మురళి, జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆవుల శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కారయదర్శి రామచంద్ర, సలహాదారు క్రిష్టఫర్‌జాన్, జిల్లా కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ సేవలు విస్తరించాలి



ఎన్ఎస్ఎస్ కార్యకలాపాలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి

వైవీయూ : ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తమ సేవలను విశ్వవిద్యాలయంలో మరింత విస్తరించాలని వైవీయూ ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి సూచించారు. శనివారం వైవీయూ ఎన్ఎస్ఎస్ యూనిట్–2 ఆధ్వర్యంలో సీతాకోకచిలుకల పార్కు సమీపంలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవడం ద్వారా విశ్వవిద్యాలయాన్ని క్లీన్ యూనివర్సిటీగా తీర్చిదిద్దవచ్చన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. ఎస్.పి.వి. రమణ, వలంటీర్లు పాల్గొన్నారు.

డీఈఓకు ఘన సన్మానం



డీఈఓ అనురాధను సన్మానిస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : జిల్లా నూతన విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన మర్రెడ్డి అనురాధను శనివారం ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘ నాయకలు కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల శివార్జున మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులకు పదోన్నతుల రిజర్వేషన్లను పారదర్శంగా అమలు పరచాలని కోరారు. అనంతరం డీఈఓ మర్రెడ్డి అనురాధ మాట్లాడుతూ జిల్లాలో త్వరలో జరగబోయే పదవ తరగతి పరీక్షల్లో మెరుగైన ఉత్తీర్ణత శాతాన్ని సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు శేషగిరిరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుదర్శన్‌బాబు, గంగరాజు, కార్యదర్శులు మంజుల, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

13న వేలం పాట

కమలాపురం : స్థానికంగా ఉన్న దినసరి మార్కెట్, బస్టాండు, జంతు వధశాల, మార్కెట్ గదులకు ఈ నెల 13న బహిరంగ వేలం పాట విధించినట్లు నగర కమిషనర్ రాముడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2025 మార్చి 31 వరకు దినసరి మార్కెట్, బస్టాండు, జంతు వధశాల, మార్కెట్ రూములకు వేలం పాట దక్కించుకున్న వారు రుసుములు వసూలు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. మార్కెట్, బస్టాండుకు రూ.50 వేలు, జంతువధ శాల, మార్కెట్ గదులకు రూ.20వేల చొప్పున డీడీలు ఈనెల 12 లోగా కార్యాలయంలో అందజేయాలన్నారు. అలాగే సాల్వెన్సి సర్టిఫికెట్లు కూడా అందజేయాలన్నారు.

జగనన్నను మరోసారి ఆశీర్వదించండి

ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా



'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ బాషా కోరారు. శనివారం 'గడప గడపకు మన ప్రభుత్వం'లో భాగంగా 50వ డివిజన్‌లోని సాయిపేట, మఠంబడి తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏవిధంగా చేరుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాల వల్ల ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించి, ముఖ్యమంత్రి సంతకంతో కూడిన బుక్‌లెట్‌ను వారికి అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయంగా ముఖ్యమంత్రి పనిచేస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కుల, మత, పార్టీలకతీతంగా అర్హత ఉన్న పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారని, ఇంకా ఎవరైనా అర్హులకు పథకాలు అందలేదా అని తెలుసుకునేందుకు 'గడప గడపకు మన ప్రభుత్వం', జగనన్నకు చెబుదాం కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రతి ఒక్కరికీ మేలు చేస్తున్నారని తెలిపారు. మంచి మనసున్న ముఖ్యమంత్రి జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, 50వ డివిజన్ ఇన్‌చార్జి కె.రాజశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు అహమ్మద్‌బాషా, జయచంద్రారెడ్డి, సీహెచ్ వినోద్, ఎస్. సుబ్బారెడ్డి, రామ్మోహన్ రెడ్డి, రమేష్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, పస్తం అంజి, కె. బాబు, బండి మరియలు, టీపీ వెంకట సుబ్బమ్మ, నారాయణమ్మ, మల్లీశ్వరి, సునీత పాల్గొన్నారు.

కడపను పరిశుభ్ర నగరంగా తీర్చిదిద్దుతాం

కడప కార్పొరేషన్ : రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కడప నగరాన్ని అత్యంత సుందరంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దడంలో ముందున్నామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా పేర్కొన్నారు. శనివారం నగరంలోని 10వ డివిజన్ ఎన్జీవో కాలనీ బిలాల్ మజీద్ వద్ద.. రూ.10 లక్షల కార్పొరేషన్ జనరల్ ఫండ్ ద్వారా నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా అంజాద్ బాషా మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో జిల్లాలో కుంటుపడిన అభివృద్ధి పనులన్నీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో పునరుద్ధరణకు నోచుకుంటున్నాయన్నారు. జగనన్న పాలనలో కడప జిల్లాతో పాటు కడప నగరం మరింత అభివృద్ధి పథంలో నడుస్తోందన్నారు. ప్రత్యేకించి కడప నగరాన్ని సుందర నగరంగా, పరిశుభ్రంగా, ఆదర్శవంతంగా తీర్చిదిద్దడం జరుగుతోందన్నారు. ఇప్పటికే కడపలోని అన్ని ప్రధాన కూడళ్లు, ప్రధాన రోడ్ల అభివృద్ధితో పాటు డివిజన్లలో అన్ని రకాల మౌలిక వసతులను కల్పించడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో 10వ డివిజన్ కార్పొరేటర్ మల్లికార్జున, వైఎస్సార్‌సీపీ నాయకులు పి. జయచంద్రారెడ్డి, బంగారు నాగయ్యయాదవ్, తోటక్రిష్ణ, షఫీ, షంషీర్, మౌలానా, షబ్బీర్, మజీద్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ 'ఏ' సర్టిఫికెట్ పరీక్ష ప్రారంభం



కేడెట్స్ డ్రిల్ టెస్ట్ పరిశీలిస్తున్న లెఫ్టినెంట్ కల్నల్ రాజ్‌కుమార్ థాపా

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని ముగ్గురాళ్ల కృష్ణప్ప మెమోరియల్ గాంధీనగర్ ఉన్నత పాఠశాల మైదానంలో శనివారం ఎన్‌సీసీ 'ఏ' సర్టిఫికెట్ కోర్సు డ్రిల్ పరీక్షలు నిర్వహించారు. కడప 30 ఆంధ్రా బెటాలియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రిల్ టెస్టును బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ రాజ్‌కుమార్ థాపా విచ్చేసి పరిశీలించారు. ఎన్‌సీసీ కేడెట్స్ చేసిన డ్రిల్లు, మ్యాప్‌రీడింగ్, వెపన్‌ట్రైనింగ్ అంశాలను పరిశీలించారు. అనంతరం మున్సిపల్ హైస్కూల్ మెయిన్, గాంధీనగర్, హైదరాబాద్ పబ్లిక్‌స్కూల్, ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్‌స్కూల్, బాలవికాస్ హైస్కూల్, రాయచోటి రాజు విద్యాసంస్థలు, బద్వేలు ఫాతిమా హైస్కూల్ తదితర పాఠశాలల ఎన్‌సీసీ కేడెట్స్‌కు డ్రిల్ టెస్టులు నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు పి.వి. సుబ్బారెడ్డి, ఇమాంభాసీం, జయచంద్ర పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాలపై 'ఇంటాక్' కొత్త పుస్తకం



సమావేశంలో పాల్గొన్న ఇంటాక్ సంస్థ ప్రతినిధులు

కడప కల్చరల్ : జిల్లాలోని పర్యాటక ప్రాంతాలు, వారసత్వ సంపదపై కొత్తగా పుస్తకం తీసుకురావాలని ఇంటాక్ నిర్ణయించింది. ఇంటాక్ ఆధ్వర్యంలో శనివారం సంస్థ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఇంటాక్ జిల్లా ఛాప్టర్ కన్వీనర్ లయన్ మానస కె. చిన్నప రెడ్డి మాట్లాడుతూ 15 ఏళ్ల క్రితం సిద్దవటం సీతారామయ్య కన్వీనర్‌గా, ఎం. జానకిరాం కో కన్వీనర్‌గా జిల్లా వారసత్వ విశేషాలతో పుస్తకం వెలువరించారని, ప్రస్తుతం ఎన్నో మార్పులు సంతరించుకొన్న పర్యాటక, వారసత్వ ప్రాంతాల గురించి పూర్తిస్థాయి వివరాలతో పుస్తకం తేవాల్సి ఉందన్నారు. పూర్వ కన్వీనర్ ఎలియాస్ రెడ్డి, వైవీయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్. ఈశ్వర రెడ్డి, చిత్రకళ విభాగం ప్రతినిధి సిహెచ్. వెంకటేష్, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్యాట్రన్ పద్మప్రియ చంద్రా రెడ్డి, కార్యదర్శి కొండూరు జనార్దన రాజు, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్షులు పోతుల వెంకట్రామి రెడ్డి, పయ్యావుల వేణుగోపాల్, వైవీయూ పాలకమండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి పలు సూచనలు చేశారు. డాక్టర్ రంగనాథ రెడ్డి, పీవీ రమేష్, శివయ్య, సంపత్, కె. సంజీవ రెడ్డి, సట్టి భారవి, రాఘవేంద్ర వర్మ, బోగాల కొండారెడ్డి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, కవి కల్లూరు బాలయల్లారెడ్డి, డా. వెల్లాల వేంకటేశ్వరాచారి, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సత్యనారాయణస్వామి పూజ



కార్పొరేటర్ కె. సూర్యనారాయణరావుకు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, జగనన్న ప్రభుత్వం కలకాలం వర్ధిల్లాలని 25వ డివిజన్ కార్పొరేటర్ కె.సూర్యనారాయణరావు ఆధ్వర్యంలో శనివారం స్థానిక కోఆపరేటివ్ కాలనీలోని ఆయన స్వగృహంలో సత్యనారాయణ స్వామి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు, కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పూజలో పాల్గొని కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం సూర్యనారాయణ రావు ఇచ్చిన ఆతిథ్యాన్ని స్వీకరించి, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఉషారాణి, సీపీసీ మేనేజింగ్ డైరెక్టర కె. ఉదయ్ కిరణ్, శరణ్య సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధి వైఎస్సార్‌సీపీతో సాధ్యం



సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వీరపునాయునిపల్లె : రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం ముందుకు సాగాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని మండల ఎన్నికల ఇన్‌చార్జి మహేంద్రారెడ్డి తెలిపారు. శనివారం ఆయన రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డితో కలసి మండలంలోని తలపనూరు గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుపై మీ ఓటును వేసి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఎంపీ అవినాష్‌రెడ్డిని మంచి మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్టీలకు, మతాలకు, కులాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. వైస్సార్ కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. చంద్రబాబు నాయుడుకు ఓటమి భయం పట్టుకుందని అందుకే పొత్తుల కోసం ఇతర పార్టీల చుట్టూ తిరుగుతున్నాడన్నారు. కార్యక్రమంలో సర్పంచు శివమారుతిరెడ్డి, మాజీ సర్పంచులు చెన్నకేశవరెడ్డి, ఉత్తమారెడ్డి, స్థానిక నాయకులు శివప్రసాదురెడ్డి, మునిరెడ్డి, మొరళీమోహన్‌రెడ్డి, రామాంజనేయరెడ్డి, శ్రీనివాసుల్‌రెడ్డి, ఈశ్వరయ్య, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కచ్చితమైన ఓటర్ల జాబితా రూపొందించాం



మాట్లాడుతున్న ఆర్ఓ చంద్రమోహన్

కమలాపురం : నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పారదర్శకమైన, కచ్చితమైన, స్వచ్ఛమైన ఓటర్ల జాబితాను రూపొందించామని ఈఆర్ఓ చంద్రమోహన్ తెలిపారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్ల తుది జాబితాపై ఎన్నికల సన్నద్ధతకు చేపట్టిన చర్యలను వివరిస్తూ నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో కచ్చితమైన ఓటర్ల జాబితాను రూపొందించామని, ఇంకనూ ఏవైన అభ్యంతరాలు ఉంటే ఎప్పటికప్పుడు సవరించడం జరుగుతుందన్నారు. గత ఏడాది డిసెంబర్ 9న కటాఫ్ డేట్‌గా నిర్ణయించి అప్పటి వరకు వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించి జనవరి 22న ఓటర్ల తుది జాబితా విడుదల చేశామన్నారు.

249 పోలింగ్ స్టేషన్లకు సంబంధించిన ఓటరు జాబితాను అన్ని రాజకీయ పార్టీలకు అందజేశామన్నారు. ఈ జాబితా ప్రకారం 98037 మంది పురుషులు, 102151 మంది మహిళలు, 34 మంది థర్డ్ జెండర్‌లతో కలిపి మొత్తం 2,00,222 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. అలాగే నియోజకవర్గంలో 230 సర్వీసు ఓటర్లు, 2856 మంది దివ్యాంగుల ఓటర్లు ఉన్నాయన్నారు. ఫైనల్ పబ్లికేషన్ ప్రకారం మొత్తం చేర్పులు 10,146 కాగా, తొలగించిన ఓటర్లు 7503 గా నమోదయ్యా యన్నారు. అలాగే ఈ జాబితా ప్రకారం నియోజకవర్గంలో ఫారం -6(655), ఫారం-7 (991), ఫారం-8 (642) మొత్తం 2288 ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని తగిన ఆధారాలతో పరిష్కరిస్తామన్నారు. ఈ సమావేశంలో కమలాపురం, చెన్నూరు, వల్లూరు, పెండ్లిమర్రి, సీకేదిన్నె, వీ ఎన్‌పల్లె తహసీల్దార్లు సుబ్రహ్మణ్యం, ప్రకాష్‌బాబు, అమర్నాథ్, చంద్రశేఖర్ వర్మ, భాగ్యలక్ష్మి, ఇ.అమర్‌నాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విష్ణు నామ జపం



కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



పూజ నిర్వహిస్తున్న అర్చకుడు

కడప కల్చరల్ : విష్ణు సహస్ర నామ జపంతో జన్మ ధన్యమవుతుందన్న విశ్వాసం భక్తుల్లో ఉందని, పురాణాలు సైతం స్వర్గ సాధనకు దీన్ని ఉత్తమమైన మార్గంగా సూచించారని హౌసింగ్‌బోర్డు శ్రీ కోదండ రామాలయ నిర్వాహకులు దేశు వెంకటరెడ్డి అన్నారు. ఆలయ 24వ వార్షికోత్సవం సందర్భంగా మూడు రోజులుగా ఉదయం, సాయంత్రం ఆలయంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. చివరి రోజు శనివారం శ్రీ విష్ణు సహస్ర నామ కోటి జప యజ్ఞం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొంటే నైతిక విలువలు అలవడతాయని, తద్వారా ప్రశాంతమైన సమాజం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమానికి చెన్నై నుంచి అఖిల భారత విష్ణు సహస్ర నామ పారాయణ సమాఖ్య అధ్యక్షులు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ శ్రీధర్, ఉపాధ్యక్షులు సువర్చల, బెంగుళూరు, తిరుపతిల నుంచి విష్ణు నామ జపంలో విశేష అనుభవం గల 30 మందితోకూడిన ప్రత్యేక బృందాలు వచ్చాయి. వీరితోపాటు జిల్లాలోని దాదాపు అన్ని మండలాల నుంచి పలు దేవాలయాల ధార్మిక మండళ్లు కార్యక్రమంలో పాల్గొన్నాయి. ఒక్కొక్క బృందానికి మూడు గంటలు చొప్పున జపయజ్ఞంలో పాల్గొనేందుకు నిర్వాహకులు అవకాశం కల్పించారు. కార్యక్రమంలో పాల్గొనేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలి రావడంతో ఆ ప్రాంతమంతా తిరునాలను తలపించింది. స్థానిక ధార్మిక వేత్తలు పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను సరిచేసిన సిబ్బంది



ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎత్తులో ఉంచిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

కడప కార్పొరేషన్ : కడప నగరం ఉక్కాయపల్లె సమీపంలో మాచుపల్లి రోడ్‌లో ఓ ప్రైవేటు స్థలం వారు మట్టి తోలడం వల్ల ట్రాన్స్‌ఫార్మర్ మట్టిలో పూడిపోయింది. ఈ విషయాన్ని ఇటీవల 'ట్రాన్స్‌ఫార్మర్ మట్టిలో పూడిపోతున్నా పట్టించుకోరా' శీర్షికన 'సాక్షి' వార్త ప్రచురించింది. దీనిపై స్పందించిన అధికారులు ఆ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎత్తులో పెట్టి, పూడిపోయిన సామాగ్రిని వెలికితీశారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



పాడదుర్తిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కమలాపురం : కుల మతాలు, పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత జగనన్న ప్రభుత్వానిదేనని వైఎస్సార్, జేసీఎస్ మండల కన్వీనర్లు ఉత్తమారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, డీసీసీబీ జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బారెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని పాడదుర్తి సచివాలయ పరిధిలోని పాడదుర్తి, వెంకటాపురం గ్రామాలలో మాజీ సర్పంచ్ శ్రీరాం రమణ ఆధ్వర్యంలో వారు ఇంటింటికి తిరిగి జగనన్నకే ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటి తలుపు తట్టి వారికి ఈ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనన్ని పథకాలు ఏపీలో మాత్రమే అమలు అవుతున్నాయన్నారు. పార్టీలు, కుల, మతాలకు అతీతంగా పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని వివరించారు. ఈ పథకాలన్నీ తిరిగి రావాలంటే జగనన్నను సీఎం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డిని, వైఎస్ అవినాష్‌రెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ, మండల నాయకులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

చెన్నూరు : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల గురించి 'పల్లెకు పోదాం' అనే కార్యక్రమం ద్వారా శనివారం మండలంలోని దౌలతాపురం ఎస్టీ కాలనీలోని గిరిజనులకు వివరించామని బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు గాడి భాస్కర్ తెలిపారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో కేంద్ర ప్రభుత్వ పథకాలైన విశ్వకర్మ యోజన, భారతీయులకు ఆహార భద్రత, రైతు సంక్షేమానికి భరోసా కింద పీఎం కిసాన్ , ఆయుష్మాన్ భారత్ పథకం వంటి వివిధ పథకాలను ప్రజలకు వివరించామన్నారు. కార్యక్రమంలో కమలాపురం నియోజకవర్గ కో కన్వీనర్ భరత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు లోమడ శివారెడ్డి, చెన్నూరు కన్వీనర్ బి.వీరప్రతాపరెడ్డి పాల్గొన్నారు.

బస్సు సర్వీసు ప్రారంభం



బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : ప్రజల సౌకర్యార్థం బద్వేలు డిపో నుంచి నూతనంగా ఏర్పాటు చేసిన బద్వేలు–విజయవాడ బస్సు సర్వీసును శనివారం ఎమ్మెల్యే డాక్టర్ సుధ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బద్వేలు నియోజకవర్గం నుంచి ఎంతో మంది విద్యార్థులు విజయవాడలో విద్యను అభ్యసిస్తున్నారన్నారు. గత ఐదేళ్ళుగా బద్వేలు డిపో నుండి విజయవాడ సర్వీసు లేని కారణంగా విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేటు బస్సులు, ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తుండేదని అన్నారు. ఆయా ప్రాంతాల ప్రజల విన్నపం మేరకు ఎమ్మెల్సీ డీసీ గోవింద రెడ్డి చొరవతో నూతన సర్వీసు ఏర్పాటుకు కృషి చేయడం జరిగిందని తెలిపారు. మొదటి సర్వీసు ప్రతిరోజూ రాత్రి 8 గంటలకు బద్వేలు నుంచి పోరుమామిళ్ళ, కలసపాడు, గిద్దలూరు, మార్కాపురం మీదుగా విజయవాడకు చేరుకుని తిరుగు ప్రయాణం ఉదయం 7-45 గంటలకు ఒంగోలు, పామూరు మీదుగా బద్వేలుకు సాయంత్రం 3-45 గంటలకు చేరుతుందని తెలిపారు. అలాగే రెండవ సర్వీసు ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు బద్వేలు నుండి బయలుదేరి పామూరు, ఒంగోలు మీదుగా విజయవాడకు సాయంత్రం 5-15 గంటలకు చేరుకుని తిరుగు ప్రయాణం రాత్రి 8-30 గంటలకు మార్కాపురం, గిద్దలూరు, పోరుమామిళ్ళ మీదుగా ఉదయం 5 గంటలకు బద్వేలుకు చేరుకుంటుందని తెలిపారు. నియోజకవర్గ ప్రజలు ఈ సర్వీసును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ గోపాలస్వామి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి యద్దారెడ్డి, కలసపాడు జెడ్పీటీసీ గురివిరెడ్డి, ఎంపీపీ నారాయణ, సీనియర్ నాయకులు పురుషోత్తం రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్లు సత్యం, చెన్నకృష్ణారెడ్డి, ఆర్టీసీ డీఎం జె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రేపు ప్రభుత్వ కార్యాలయాల ప్రారంభం

వీరపునాయునిపల్లె : మండలంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాలు, సచివాలయ భవనాలను సోమవారం ప్రారంభించనున్నట్లు మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటలకు యు.రాజుపాలెంలోని ఆరోగ్య ఉపకేంద్రం, 10 గంటలకు ఇందుకూరులోని రైతు భరోసా కేంద్రం, 11 గంటలకు తలపనూరులోని గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య ఉపకేంద్రం, 11.30 గంటలకు వెల్దురిలో ఆరోగ్య ఉప కేంద్రాలను ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొనాలని ఆయన కోరారు.

